క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మర్రిపాడు: మండలంలోని నందవరం చెరువు సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై గురువారం కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. రామానాయుడుపల్లి గ్రామానికి చెందిన దేవినేని వెంగయ్య నందవరం చెరువుకట్ట సమీపంలోని బంధువుల ఇంటికి వస్తుండగా కారు ఢీకొంది. వెంగయ్యకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కారును డ్రైవర్ ఆపకుండా పరారవడంతో గంగుంట సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు మర్రిపాడు పోలీసులు తెలిపారు.

వ్యవసాయరంగ అభివృద్ధికి పెద్దపీట

అల్లూరు: వ్యవసాయరంగ అభివృద్ధికి ఎస్‌బీఐ పెద్దపీట వేస్తోందని నెల్లూరు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ లోకనాథం పేర్కొన్నారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నార్త్‌ఆములూరులోని పొదుపు గ్రూపులకు రూ.2కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను గురువారం పంపిణీ చేశారు. ఏపీఎం ప్రసాద్‌రావు, సర్పంచ్ కరిముల్లాషాఖాదర్, మాజీ సర్పంచ్ డేవిడ్,తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

సోమశిల: యువత క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అనంతసాగరంలో జాలీబాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. వైస్‌ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ బొర్రా శోభ, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీఓ మధుసూదన్, డీటీ ప్రదీప్, ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు: సంక్రాంతి సందర్భంగా మండలంలోని జనార్దనాపురంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి గురువారం ఆయన ప్రారంభించారు. కలిగిరి జెడ్పీటీసీ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు నగదు అందజేత

ఉదయగిరి: వెంగళరావునగర్‌లో యువత ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న సంక్రాంతి క్రికెట్ పోటీలకు జీఎంకే ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి తన ట్రస్ట్ సభ్యుల ద్వారా రూ.10,116 నగదును గురువారం అందజేశారు. రన్నర్ జట్టుకు నగదును అందజేయనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ట్రస్టు సభ్యులు బీ వెంకటేశ్వర్లు, ఆర్ అంకయ్య, పీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మినీజాబ్‌మేళా

అల్లూరు: జిలా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మినీజాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాకు 52 మంది నిరుద్యోగులు హాజరుకాగా, 33 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. మండల సమాఖ్య ఏసీ లలిత, ఎంప్లాయిమెంట్ ఆఫీస్ అధికారి భవానీ శంకర్, శ్రీహరి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

వింజమూరు: సంక్రాంతి సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ ఎస్ సుజన, ఉపసర్పంచ్ జయలక్ష్మి గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు.

సెబ్ విస్తృత తనిఖీలు

అల్లూరు: సంక్రాంతి సందర్భంగా నాటుసారా కాసే అవకాశం ఉండడంతో సింగపేట, మూర్తిరాజ సంఘం, తదితర ప్రాంతాల్లో సెబ్ అధికారులు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. గతంలో నాటుసారా తయారు చేస్తూ పట్టుబడిన వారికి ముందస్తుగా హెచ్చరికలు చేశారు. కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, కావలి ఇన్‌స్పెక్టర్లు నరహరిరావు,జీ సూర్యనారాయణ, కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హద్దుల పరిశీలన

ఉదయగిరి: దుత్తలూరు నుంచి సీతారామపురం వరకు నిర్మించనున్న 167బీజీ జాతీయ రహదారి హద్దులను తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి గురువారం పరిశీలించారు. కుర్రపల్లి, ఉదయగిరిలో రైతులు కోల్పోనున్న భూములు, గృహాలను పరిశీలించారు.

వివేకానందుడి బోధనలు స్ఫూర్తిదాయకం



కావలి: 2కే ర్యాలీని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు



సంగం: వివేకానందుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



ఆత్మకూరు: వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



దుత్తలూరులో రక్తదానం చేస్తున్న యువత



కావలి డీబీఎస్ కళాశాలలో..



చేజర్లలో..



ఏఎస్‌పేటలో..

కావలి: స్వామి వివేకానందుడు బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యువతా లేవండి...మేల్కొండి..గమ్యాన్ని చేరే వరకు విశ్రమించకండి..ఇనుప కండరాలు, ఉక్కునరాలు, వజ్ర సంకల్పం కలిగిన వంద మంది యువకులు తనకు లభిస్తే ప్రపంచాన్నే మార్చేస్తానన్న స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. రెడ్‌క్రాస్ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

కావలి రూరల్: పట్టణంలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో యువజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి విగ్రహానికి రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ టీవీ రావు, అడ్మినిస్ట్రేటీవ్ అధికారి రమేష్ బాబు, రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కిషోర్ రెడ్డి, హెచ్‌ఓడీ దేవానంద్, డాక్టర్ షేక్ అక్మల్, ఏబీవీపీ నాయకులు మహంత్‌రెడ్డి, త్రికాంత్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మేధా పాఠశాలలో అపస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అపస్ నాయకులు సోమవరపు యానాదిరెడ్డి, చలవయ్య, అనీల్‌కుమార్, పెంచలరెడ్డి, వీ నారాయణరావు, టీ వెంకటసుబ్బయ్య, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడు ఆదర్శప్రాయుడు

సంగం: స్థానిక గ్రంథాలయంలో స్వామివివేకానందుడి చిత్రపటానికి లైబ్రేరియన్ రవీంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతిభా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంగం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆపస్ ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతిని నిర్వహించారు. ఎంఈఓ జానకీరాం ముఖ్యఅతిథిగా హాజరై వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆపస్ నాయకులు సురేంద్రరెడ్డి, దశయ్య, ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: స్థానిక గ్రంథాలయంలో వివేకానందుడి చిత్రపటానికి లైబ్రేరియన్ శ్రీనివాసరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చేజర్ల: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వివేకానంద పార్క్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి సొసైటీ అధ్యక్షుడు బీ వీరరాఘవరెడ్డి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. నాయకులు షేక్ నజీర్, రంపాటి ప్రసాద్ ,షేక్ రసూల్, షేక్ సర్దార్, దావూద్, షేక్ లతీఫ్, నాగిరెడ్డి, గట్టుపల్లి లక్ష్మీనారాయణ, పీ వెంకటేశ్వర్లు, వాకా శ్రీనివాసులు రెడ్డి, శీనయ్య పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

దుత్తలూరు: విశ్వభారతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుత్తలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ సాయిప్రసాద్ పాఠశాలలోని వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పించి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పుల్లారెడ్డి, సభ్యులు పెసల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

బిట్రగుంట: కావలి నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేసే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. అనంతబొట్లవారికండ్రిగలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పరిపాలనలో నూతన ఒరవడి సృష్టించడంతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్నీ హామీలను అమలు చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాప్రభుత్వంగా నిలిచిందన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి అండగా నిలవాలనేదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. అందులో భాగంగా గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ఇంటింటికి తిరుగుతూ క్షేత్రస్థాయిలో పేదలకు పథకాలు అందేలా చూస్తున్నామని వివరించారు. అనంతబొట్లవారికండ్రిగ, సుందరగిరివారికండ్రిగ సర్పంచ్‌లు బత్తల శ్రీనివాసులు, ఉప్పాల మాచర్ల, ఎంపీటీసీ మాధవ, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, మహేంద్ర, వరదారెడ్డి, గునపాటి చిరంజీవి రెడ్డి, సుందరరాజ్, షమీ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన

ఆత్మకూరురూరల్: అప్పారావుపాళెం పంచాయతీ కార్యదర్శి బొటిక నరసింహులుపై టీడీపీ మద్దతుదారుడు చంద్రా మల్లికార్జున నాయుడు అనుచితంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సచివాలయ సంక్షేమ సంఘ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యదర్శులు పల్లవోలు భాస్కర్, కార్తీక్, భాను, బొటిక నరసింహులు, ఆనంద్, షఫీ, రవూఫ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని గురువారం నిర్వహించారు. 1985 నుంచి 1990 బ్యాచ్ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులు నెమరువేసుకున్నారు. ఆత్మకూరు, కావలి డిప్యూటీ డీఈఓలు భిక్షాల్, శ్రీహరిప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం షరీఫ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు గౌస్‌బాషా, బలరామయ్య, రఫి, అంజుద్‌అహ్మద్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు భూములు



మర్రిపాడు: అర్హులైన పేదలకు భూములు పంపిణీ చేస్తామని ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి అన్నారు. పొంగూరుకండ్రికలో గురువారం గ్రామసభ నిర్వహించారు. భూసమస్యలపై పెద్ద ఎత్తున ఆర్డీఓకు గ్రామస్తులు అర్జీలు అందజేశారు. ఆరుగురు పేదలు తమకు సంబంధించిన 23 ఎకరాలను ఓ వ్యక్తి ఆక్రమించి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. స్పందించిన ఆర్డీఓ భూములను పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. అప్పటి వరకు భూముల్లోకి ఎవరూ ప్రవేశించరాదని ఆదేశించారు. తహసీల్దార్ హేమంత్ కుమార్, ఆర్‌ఐ సురేంద్ర పాల్గొన్నారు.

సోమశిల: వరికుంటపాడు, ఉప్పలపాడు, సోమశిల, పీకేపాడు, పాతాళపల్లి గ్రామాల్లో తహసీల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. అసైన్‌మెంట్ కమిటీ అర్హుల జాబితాను చదివి వినిపించారు. పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, వీఆర్వో మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని 15 గ్రామాల్లో భూముల పంపిణీకి సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. 465 మంది భూముల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



అల్లూరు: అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ జాతరలో భాగంగా గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మను విశేషంగా అలంకరించి ప్రత్యేకరథంపై కొలువుదీర్చి ఊరేగించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరను వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు.

జాతర విజయవంతంపై కృతజ్ఞతలు

పోలేరమ్మ జాతర విజయవంతానికి సహకరించిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉభయదాతలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆచార వ్యవహారాల కుల పెద్దలు, పోలేరమ్మ భక్తులు, గ్రామప్రజలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



భోజ్యానాయక్

సోమశిల: సాధారణ బదిలీల్లో భాగంగా సోమశిల సబ్‌ఇన్‌స్పెక్టర్ మహబూబ్ సుభాని నెల్లూరులోని బాలాజీనగర్ స్టేషన్‌కు గురువారం బదిలీ అయ్యారు. అక్కడి ఎస్సై భోజ్యానాయక్ సోమశిల ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

కావలి రూరల్: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని కావలి రూరల్ సీఐ ఎం రాజేష్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. పట్టణానికి దగదర్తి, బోగోలు, అల్లూరు, జలదంకి, తదితర ప్రాంతాల నుంచి ప్రజలు పండగ సరుకులు, వస్త్రాల కొనుగోలుకు ఎక్కువగా వస్తున్నారని తెలిపారు. పండగ సందర్భంగా రోడ్లు రద్దీగా ఉండి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి పండగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తుంటే తమకు సమాచారం అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

చేజర్ల: యనమదల గ్రామ సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వంపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. యనమదల, కాకివాయి గ్రామాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి ఆర్‌ఐ సుమతి, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.